
**కథ**

చిట్టిపెద్ది ఉమ

# చేదు నిజం

టీవీలో వస్తున్న ప్రకటన చూస్తున్న కనకదుర్గ దృష్టి ఇల్లు అలుకుతున్న రాణి మీద పడింది. పన్నెండేళ్ల రాణి అలుకుగుడ్డ బకెట్‌లో ఉన్న ఫినాయిల్ నీళ్లల్లో ముంచి గట్టిగా పిండి ఫర్నిచర్ కింద దూరి మరీ తుడుస్తోంది. ఏ మాటకా మాటే చెప్పుకోవాలి... రాణి అమ్మ మల్లమ్మ కంటే రాణి పన్లు నీట్‌గా, శుభ్రంగా చేస్తుంది. రాణి పన్లోకి వస్తున్నప్పటి నుంచీ గిన్నెలు తళతళలాడుతున్నాయి. ఇల్లూ అద్దంలా మెరుస్తోంది.




మల్లమ్మ ఉరుకులు పరుగులతో ఏదో చేశానన్నట్టు చేయాలి కదా అన్నట్టు అడ్డ దిడ్డంగా పనిచేసిపోయేది. బట్టలకి వాషింగ్‌మెషిన్ ఉంది.. అంట్లూ ఇల్లు శుభ్రం చేసి బట్టల మిషన్‌లో వేసి తీయటం ఆరేయడం.. ఇవీ పనులు. రాణి పన్లోకి వస్తున్నప్పటి నుంచీ దుర్గకి ప్రాణం తెరిపిన పడ్డట్టుగా హాయిగా ఉంది. తను రమ్మన్న టైముకి వచ్చి అన్ని పనులూ శుభ్రంగా చేసి పోతోంది అంటే ఈ చట్టం ఒకటి? అయినా తనేం బలవంతాన దాన్ని పన్లోకి రమ్మందా? ఏదయితేనేం మల్లమ్మని పిలిచి రాణిని ఇంక పన్లోకి పంపవద్దని చెప్పాలి.. దుర్గ మనసు మూలిగింది.

''ఏంటోయ్... ఆదివారం కూడా అపరాహ్ణం దాకా అన్నం నసీబవదా మాకు?'' పేపర్ మడిచి టీపాయ్ పెడ్తూ అన్నాడు బెడ్రూమ్‌లోంచి వచ్చిన శేఖర్.

''ఇదిగో ఇప్పుడే ఇల్లు అలకడం అయింది. నడ వండి భోజనం రెడీ'' దుర్గ డైనింగ్ టేబుల్ మీద కంచాలు, గ్లాసులు సర్దుతూ అంది.

''నేను పోనా అమ్మగారూ?''

''రాణి ఉండు ఓ నిమిషం'' దుర్గ డైనింగ్ టేబుల్ మీద ఉన్న డబ్బాలోంచి రెండు వడియాలు ఓ

అప్పడం తీసి రాణి చేతిలో పెట్టింది. ''పో.. మళ్లీ మూడింటికి రా''

''దుర్గా.. రాణి చిన్న పిల్ల.. దాన్నింక పన్లోకి రానివ్వకు. టీవీ చూస్తున్నావుగా.... ఇంకో వారంలో 'బాల కార్మిక చట్టం' అమలులోకి వస్తుంది. ఈ లోపల ఇంకెవరినైనా పెట్టుకో. లేకపోతే మల్లమ్మనే రమ్మను. చిన్నపిల్లల చేత పనిచేయించుకుంటే శిక్ష కృష్ణజన్మస్థానం అంటున్నారు కూడా'' శేఖర్ పప్పూ అన్నం కలుపుకుంటూ అన్నాడు.

''ఏం చట్టమోనండీ. నా ప్రాణానికి వచ్చింది. ఏడాదిగా ప్రాణం సుఖంగా ఉందనుకుంటే మళ్లీ కొత్త మనిషిని వెదకాలి. టైముకి రాదు. సమంగా పనిచెయ్యదు''

''జాగ్రత్త కక్కుర్తి పడితే అవస్థపడాల్సింది మనమే. ఎవరైనా కంప్లైంట్ ఇస్తే పెద్ద తలనొప్పి.''

''అయ్యో.. ఆ సునందమ్మ ఇవాళో రేపో ఇంటింటికి వచ్చి లెక్చర్ దంచదూ. రాణి అక్టోబర్ పధ్నాలుగు తర్వాత ఒక్కరోజు పనికి వచ్చినా ఈవిడే పనికట్టుకు వెళ్లి పోలీస్ కంప్లైంట్ ఇస్తుంది'' దుర్గ దిగులుగా అంది.

సునంద వాళ్ల సొసైటీలోనే ఉంటుంది. ఆ ఏరియా లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్. చాలా తెలివైన దానినన్న గీర. సునంద ఇంట్లో ఏ మనిషీ పది రోజులు కుదురుగా పని చేయదు. చక్కగా పనిచేసే రాణిని తన ఇంటికి పంపమంటే మల్లమ్మ కాదందని సునందకి ఎప్పటి నుంచో దుర్గ మీద కాస్త అసూయే.

ఇప్పుడు వజ్రాయుధం లాంటి చట్టం అండ దొరికింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వార్ చెయ్యడానికి వెనుకాడదు. దుర్గ ఇంట్లో మొదట్లో మల్లమ్మే పనిచేసి వెళ్తూ ఉండేది. రాణి మల్లమ్మ వెనకే వచ్చి అంట్లు వంటింట్లోంచి తీసుకెళ్లడం మళ్లీ పెట్టడం లాంటి చిన్న చిన్న సహాయాలు చేస్తూండేది. రాణికి పదేళ్లు దాటగానే మల్లమ్మ ఇంకో రెండు ఇళ్లు వెతుక్కుని రాణికి దుర్గ ఇల్లూ, ఇంకో ఇల్లూ అప్పగించింది. రాణి వస్తున్నప్పటి నుంచీ దుర్గకి హాయిగా ఉంది. రమ్మన్న టైముకి వస్తుంది. పని కూడా మల్లమ్మలాగా ఆదరా బాదరాగా కాకుండా మెల్లిగా నీట్‌గా చేస్తుంది. మల్లమ్మలాగా పని అవ్వగొట్టాలన్నట్టు ఉరుకులు-పరుగులు పెట్టదు. అందులోనూ దుర్గ టీచర్‌గా పనిచేస్తుంది కాబట్టి రమ్మన్న టైముకి వచ్చి చెప్పిన పనల్లా నీట్‌గా చేసుకుపోయే రాణి అంటే దుర్గకి అభిమానం. దివ్యని చూసినట్టే ఆప్యాయంగా చూస్తూ ఏదో ఒకటి తినడానికి పెడ్తూ ఉంటుంది. దివ్య బట్టలు మంచివి పాతవి అయితే రాణికి ఇస్తూ ఉంటుంది.

''పన్నెండేళ్ల పిల్ల ఇంటి పనులు చెయ్యగలదు. ఈ పధ్నాలుగేళ్ల లిటిగేషన్ ఏంటో.. ఎలానూ అది చదువుకోవడం లేదు.. ఇప్పుడు అన్ని ఇళ్లల్లో పని మానిపించినా ఇంట్లో కూర్చోవాల్సిందే. వస్తున్న నాలుగు డబ్బులు పోతాయి తప్ప వేరే ప్రయోజనం ఏం ఉంటుంది కనుక'' దుర్గ మదనపడుతూనే మర్నాడు మల్లమ్మని పిలిచి చెప్పేసింది రాణిని పన్లోకి పంపొద్దని. లబోదిబోమంది మల్లమ్మ చట్టం సంగతి వింటూనే.

''ఇదేం చట్టం తల్లో.. మా నోట్లో మట్టి కొట్టడానికి వచ్చింది. నాలుగు డబ్బులు సంపాదించి కూడబెట్టి మనువుచేద్దామనుకున్నాం''

''నువ్వేమనుకున్నా మా ఇళ్లల్లో పనిచేయడానికి చట్టం ఒప్పుకోదే. నువ్వు రావాలంటే రా పన్లోకి. లేకపోతే వేరే మనిషిని చూసుకుంటాను.''

''ఈడ పని చెయ్యకపోతే మాత్రం ఇంట్లో పనంతా అదే చేస్తుంది. ఆ తర్వాత గోళ్లు గిల్లుకుంటూ కూకోవాల్సిందే. ఇప్పుడేమైనా సదూకుంటుందా ఎందుకిలాంటి సట్టాలు సేత్తారో'' మల్లమ్మ వాపోతూనే రాణి బదులుగా తనే పన్లోకి రావడానికి ఒప్పుకుంది. దుర్గ ఇల్లు వదలడానికి దానికి మనసు ఒప్పలేదు. దుర్గ ఇంట్లో పని తక్కువ జీతం ఎక్కువే కాకుండా చూసీ చూడకుండా ఎన్నో రకాలుగా పాత బట్టలు మిగిలిన అన్నం, కూరలు అంటూ ఏవో ఒకటి ఇస్తూనే ఉంటుంది.

★ ★ ★

''ఏమండీ! 'ఐ' టీవీ వాళ్లు చిన్నపిల్లలకి డాన్స్ కాంపిటీషన్ పెడుతున్నారు. దివ్యని కూడా ఆడిషన్‌కి


## కేశవర్ధిని ...

## పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందజేశారు.
కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో
కలిపి శిరోజాలకి రోజూ రెండు సార్లు బాగా రాస్తే అవి
ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ
లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.
ఈ రోజే కేశవర్ధిని కొనండి.
ఆరు నెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




**కేశవర్ధిని**

**తలనూనె**

కేశవర్ధిని ప్రొడక్ట్స్,చెన్నై - 600 087

తీసుకెళ్దాం'' దుర్గ ఉత్సాహంగా శేఖర్‌తో అంది.

''టీవీ ప్రోగ్రాములు అంటూ తిరిగితే చిన్నపిల్ల అలిసిపోతుంది. టైం వేస్ట్. చదువు కూడా పాడవుతుంది దుర్గ'' శేఖర్ వాదించాడు.

''ఊరుకోండి.. మీరెప్పుడూ అంతే. అన్నిటికీ అడ్డు చెప్తూంటారు. మన వీధిలోనే దాని డాన్స్ క్లాస్‌పిల్లలు ముగ్గురు వెళ్తున్నారు. మా స్కూల్లోంచి కూడా బోలెడంతమంది వెళ్తున్నారు తెలుసా? మొదటి ఆడిషన్‌కి వెళ్దాం. ఒక్కో రౌండ్ దాటాలిగా దివ్య నేచురల్ డాన్సర్. చక్కగా నాలుగు రౌండ్స్ ఈజీగా దాటేస్తుందని వాళ్ల డాన్స్ టీచర్ కూడా ఉత్సాహంగా ఉంది'' దుర్గ మాటల్ని కాదనలేక శేఖర్ అయిష్టంగానే ఒప్పుకున్నాడు. టీవీలో ఇలాంటి అవకాశాలు వస్తున్నప్పటి నుంచీ అందరికీ టీవీలో తమ పిల్లల్ని వాళ్లతో పాటు తమనీ ప్రదర్శించుకోవాలన్నది ఈనాటి క్రేజ్. గొప్ప. ప్రవాహంతో పాటే వెళ్లాలి కానీ.. ఎదురీదడం సులువు కాదు కదా!

శేఖర్, దుర్గ పిల్లల ఆడిషన్ ఉన్న రోజున సెలవు పెట్టి దివ్యని స్టూడియోకి తీసుకెళ్లారు. స్టూడియో అంతా తిరణాలలాగా జనం. ప్రతీవాళ్లు వాళ్ల పిల్లలకి ఫైనల్ టచెస్ సూచనలు.. ఆర్డర్స్ ఇస్తున్నారు. అందరిలోనూ తమ పిల్లలు గెలవాలన్న తపన. మొదటి రౌండ్‌లో వడపోత ఎక్కువగానే ఉంటుంది. సగానికి పైగా పిల్లలు మొదటి రౌండ్‌లోనే బయటికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. అదృష్టం కూడా కాస్త కలిసి వస్తేనే ఒక్కో రౌండ్ దాటడం సులువవుతుంది. అందుకే అటు తల్లిదండ్రులలోనూ ఇటు చిన్నారి పిల్లల్లోనూ టెన్షన్ స్పష్టంగా తెలుస్తుంది.

'పది పన్నెండేళ్లు దాటని ఈ చిన్నారి పిల్లలకీ కాంపిటీషన్ పేరుతో ఎందుకో ఈ టెన్షన్' శేఖర్ మనస్సు మూలిగింది. స్కూల్లో ఉన్న కాంపిటీషన్స్ ఒత్తిడి చాలదన్నట్టు టీవీ వాళ్లు ఆటల- పాటలు, డాన్స్ అంటూ కాంపిటీషన్స్ మొదలుపెట్టారు. గెలిచే వాళ్లకి ఆనందమే. మిగిలిన వాళ్లకి...?

దివ్య అనుకున్నట్టుగానే మొదటి రౌండ్ గెలిచి రెండో రౌండ్‌కి వచ్చింది. దుర్గ ఆనందానికి అంతు లేదు. అప్పుడే కాంపిటీషన్ ఆఖరి రౌండ్ గెలిచినట్టు మురిసిపోయింది. మిగలిన రౌండ్స్ కూడా ఈజీగా గెలవడానికి నాంది అన్నట్టుగా ఇదివరకు మూడు రోజులు ఉండే డాన్స్ క్లాసులు ఇప్పుడు ఒక్క ఆదివారం విడిచి వారానికి ఆరు క్లాసులుగా మారాయి. దుర్గ ఆదివారం కూడా ఉండడానికి రెడీయే. కానీ డాన్స్ టీచర్ సువర్ణ తనకి కుదరదని చెప్పటంతో ఊరుకుంది.

ఎక్స్‌ట్రా క్లాసులకి ఎక్స్‌ట్రా పేమెంట్. ఇంట్లో పొద్దున్నే మళ్లీ ఎక్స్‌ట్రా ప్రాక్టీస్. దాని కోసం దివ్యని ఎక్స్‌ట్రా ముద్దు చేయడం.. ఎక్స్‌ట్రా లంచాలు ఎర చూపడం.

''దుర్గా.. దివ్య అటు స్కూలూ.. ఇటు ఈ పోటీ తట్టుకోలేదు. వెధవ కాంపిటీషన్ పోనిద్దూ.. అనవసరంగా దాన్ని హైరానా పెడుతున్నావు. నువ్వు హైరానా పడ్తున్నావు'' శేఖర్ నచ్చజెప్పబోయాడు.

''మీరు ఊరుకోండి. మూడు రౌండ్స్ అయిపోయాయి.. ఇంకెంత ఇంకో మూడు, నాలుగు రౌండ్స్. వీధిలో వాళ్లందరూ ఎలా కుళ్లుకుంటున్నారో వాళ్ల పిల్లలు మొదటి రౌండ్, రెండో రౌండ్ కూడా దాటలేదని, దివ్య చూపిస్తున్నంత బాగా భావం, అభినయం మిగిలిన వాళ్లు చూపించలేకపోతున్నారని డాన్స్ టీచర్ కూడా అంటోంది. ఫైనల్ చేరుకోవడం ఖాయం అంది.. ఇప్పుడే కాస్త గట్టిగా ప్రాక్టీస్ చేస్తే దివ్య 'నాట్య మయూరి' కిరీటం గెల్చుకుంటుందేమో'' దుర్గ కలల్లో తేలిపోతూ అంది.

దివ్యకి మొదట్లో ఈ హడావిడి.. స్టూడియోలకి వెళ్లడం అన్నీ సంబరంగానే అనిపించినా రానురానూ చిరాకనిపిస్తోంది. రాత్రి స్కూల్ హోంవర్క్.. చదువుకోవడం.. సాయంత్రం డాన్స్‌క్లాసులు.. మర్నాడు పొద్దున్నే మళ్లీ ప్రాక్టీస్... సాయంత్రాలు ఆడుకోవడం అన్నది మర్చిపోయి అప్పుడే రెండు నెలలు దాటింది. అన్నం తినేటప్పుడు ఓ పది నిమిషాలు తప్ప టీవీ కూడా చూడడానికి లేదు. అందుకే ఎంత ముద్దు చేసినా ఏ లంచం ఇవ్వజూపినా వినకుండా డాన్స్ ప్రాక్టీస్ చెయ్యమంటే మొండికేస్తోంది. దుర్గకి టెన్షన్ పెరిగిపోతోంది. ఆఖరులో మిగిలిన ఇరవైమందిలో దివ్య చాలా బాగా డాన్స్ చేస్తోందని స్కూల్లో అందరూ కంగ్రాట్స్ చెప్తూంటే ఉప్పొంగిపోతోంది. కానీ నాలుగో రౌండ్‌కి నాలుగు రోజులు కూడా లేదు. దాని కోసం ప్రత్యేకంగా నేర్పుతున్న 'నెమలి' డాన్స్ అస్సలు సమంగా చేయడం లేదని సువర్ణ విసుక్కుంది. ఇంట్లో బాగా ప్రాక్టీస్ చేయించుకుంది.

''దివ్యా.. లే అమ్మా.. డాన్స్ ప్రాక్టీస్ చేయాలి'' తెల్లవారుఝాములో నాలుగు గంటలకే దివ్యని మేలుకొలపడం ప్రారంభించింది దుర్గ.

''స్టెప్పులు అస్సలు సమంగా పడటం లేదు. ఈ రెండ్రోజులూ ప్రాక్టీస్ సమంగా చేయకపోతే ఈ రౌండ్‌లో బయటికి రావడం ఖాయం'' అని చేతులెత్తేసింది డాన్స్ టీచర్ సువర్ణ.

దుర్గ పొద్దున్న ఏటిండిలోపులే ఇంట్లో పనులన్నీ ముగించుకుని స్కూల్‌కి బయలుదేరిపోతుంది. అందుకే ఓ పక్క ఇంట్లో పనులు చక్కబెట్టుకుంటూ మధ్యమధ్య దివ్యని లేపుతోంది. దివ్య నిద్ర వస్తుందని, లేవనని మొరాయిస్తోంది.

''ఈ రెండు రోజులు సరైన ప్రాక్టీస్ చేయకపోతే ఇన్నాళ్ల శ్రమా వేస్ట్''

''ఈ రౌండ్ ఓడిపోయేటట్టు ఉంది'' దుర్గలో టెన్షన్, కోపం. వంట, టిఫిన్ల పని చూస్తూనే ఎన్నిసార్లు మధ్య మధ్య వచ్చి లేపుతున్నా లేవని దివ్యని చూస్తే ఒళ్లు మండిపోయింది దుర్గకి. రెండు బాది లేపి కూచోపెట్టింది.

దివ్య మొండిగా పక్కమీద వాలిపోతుంటే మరో రెండు దెబ్బలు- నాలుగు తిట్లూ పడ్డాయి.

''మెల్లిగా చెప్పు. అలా కొడితే మరీ మొండికేస్తుంది. అయినా మూడు రౌండ్స్ గెలిచిందిగా చాల్లే'' శేఖర్ నిద్ర ఎలాగూ పాడయిందని లేస్తూ అన్నాడు.

''మీరు ఊరుకోండి. రెండురోజులింక.. కాస్త చక్కగా ప్రాక్టీస్ చేస్తే ఈ రౌండ్ కూడా అయిపోతుంది. ఏమొచ్చిందో ఏమో సమంగా చెయ్యడం లేదని డాన్స్ టీచర్ విసుక్కుంటోంది. ఎంత చెప్పినా సమంగా చేయటం లేదుట'' దుర్గ దివ్యని లేపి మంచో బెట్టి క్యాసెట్ ఆన్ చేసింది.

దివ్య నీరసంగా మంచుందే తప్ప అడుగు కదపలేదు.

''ముందు వెళ్లి పిల్లకి వేడిపాలు పట్టుకురా. నిద్ర కళ్లతోనే డాన్స్ చెయ్యి అంటే ఎలా చేస్తుంది. నేను మెల్లిగా చెప్తాను'' శేఖర్ దుర్గని కసురుకున్నాడు.

''నాన్నా డాన్స్ వద్దు.. కాళ్లు నెప్పులు'' దివ్య శేఖర్ పక్కన సోఫాలో కూలబడుతూ ఏడ్చింది.

''ఏం రోగం.. ఒక్క రెండు రోజులు కాస్త కష్టపడితే ఈ రౌండ్ గట్టెక్కుతుంది. మళ్లీ పదిహేను రోజుల దాకా ఇంకో రౌండ్ ఉండదు. తిక్క వేషాలు వెయ్యకు. కాళ్లు విరగ్గొడతా చెయ్యకనంటే'' దుర్గ దివ్యకి పాలు అందించి తిట్ల దండకం చదివింది.

దుర్గ స్కూల్‌కి వెళ్లే లోపలే పని చేసి వెళ్లే మల్లమ్మ అప్పుడే అంట్లుతోమి ఇల్లు అలకటం మొదలుపెట్టింది. దుర్గ, శేఖర్, దివ్య మధ్య జరుగుతున్న గొడవంతా గమనిస్తూనే ఉంది చాలాసేపటిగా.

''లే.. రేపు లీవ్‌పెట్టి బాగా ప్రాక్టీస్ చేయిస్తాను. ఇప్పుడో రెండుసార్లు చెయ్యి'' దుర్గ క్యాసెట్ తిరిగి ఆన్ చేసింది.

దివ్య లేవకుండా మొండిగా సోఫాలో అలాగే కూర్చుంది లేవడం ఇష్టం లేదన్నట్లుగా.

దుర్గ ఒళ్లు మండిపోయి దివ్య చెయ్యి పట్టుకుని విసురుగా లాగి నించోపెట్టింది.

''ఊ..చెయ్యి..''

''దివ్యమ్మ.. మా రాణి కంటే సిన్నదేగా.. ఇంత శ్రమ అమ్మాయిగోరు మాత్రం పడగలరేటి'' మల్లమ్మ అనకుండా ఊరుకోలేకపోయింది.

దుర్గకి మల్లమ్మ మాటలు కొరడాతో కొట్టినట్టు అనిపించాయి. శేఖర్‌వైపు చూసింది.

శేఖర్ కళ్లు కూడా విస్మయంతో వెడల్పయ్యాయి.

మల్లమ్మ ఎలా అన్నా ఏ పదాలు ఉపయోగించినా మల్లమ్మ అంటున్నది మాత్రం చైల్డ్ లేబర్ అంటూ రాణిని పని మానిపించారు కదా డాన్స్ మాత్రం పని కాదా? మరి ఇంట్లో ఎంత పని చేసినా, ఎంత శ్రమ పడ్డా తప్పుకాదా? అనే.

దుర్గలో ఏదో తెలియని నీరసం.. అంతర్మథనం. కేసెట్ ఆఫ్ చేసి మల్లమ్మ మాటల్లో యదార్థం గురించి ఆలోచిస్తూ వంటింట్లోకి నడిచింది. రెండు నిమిషాలు టైము దొరకగానే దివ్య శేఖర్ ఒళ్లో తలపెట్టుకుని నిద్రలోకి జారుకుంది. శేఖర్ దివ్య తల నిమురుతూ ఆలోచనలో పడ్డాడు. మల్లమ్మ మాటలు తలుచుకుంటూ తను రాయబోయే కథకి ఈ ప్లాటుని ఎలా వాడుకోవచ్చో అని ఆలోచించసాగాడు.

☆